



"మనసు విప్పి – నా భావాలన్నీ – నీ ముందుంచాను మరి నిన్ను తీసుకొనే నిర్ణయంమీదే ఆధారపడి వుంటుంది, స్వప్నా నా భావిజీవితం !!" అంటూ ఆమె వైపు చూశాడు, శ్రీకాంత్ – అర్థింపుగా.

స్వప్న హృదయం, పులకరించింది అతని మాటలకి.

పెద్ద కెరటం ఒకటి - విసురుగావచ్చి – పాలనురుగుతో– వారి పాదాలని తడిపివెళి పోయింది

వారికొంచెం వెనక్కి జరిగారు యిద్దరూ.

ఉప్పొంగ తరంగాల మీదుగా వీస్తున్న– చల్లగాలికి– అతని జుత్తు రేగిపోయి, వింత అందాన్నిస్తోంది. ఆ అందాన్ని, రెప్ప వేయకుండా, అలా ఎంతసేపయినా చూడాలని పిస్తోంది స్వప్నకు.

కానీ- వంచిన తల పైకెత్తలేకపోతోంది.

ఆడపిల్లకుండే సహజమయిన సిగ్గు అడ్డు వస్తోంది అతని ప్రశ్నకు సమాధానం యివ్వకుండా, నేలచూపులు చూస్తూ – మౌనంగా వుండిపోయింది స్వప్న.

శ్రీకాంత్ మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"ఆమె పోయిన కొద్దిరోజులకే నాపై ఒత్తిడి తేవటం ప్రారంభించింది అమ్మ. కానీ–

అప్పటో మళ్ళీ పెళ్ళంటే – సుతారము యిష్టపడని నేను, చిరాకుగా అమ్మ మాటని త్రోసిపుచ్చేవాడిని.

ఫలితంగా కుటుంబంలో అందరిలోనూ తీరని అశాంతి, ఆవేదన చోటుచేసుకున్నాయి. అప్పటినుంచే ప్రారంభం అయ్యింది, అమ్మ ఆరోగ్యం క్షీణించటం'' చెప్పటం ఆపి, స్వప్న ముఖంలోకి చూశాడు శ్రీకాంత్.

ఆసక్తిగా వింటోంది స్వప్న.

"ఆమె విడబాటు నన్ను పిచ్చివాడిని చేసింది. ఆమె స్థానంలో — మరొకరిని వూహించుకోలేని నేను అమ్మ మంచంపట్టినా సరే, మరో పెళ్ళికి అంగీకరించలేకపోయాను. అంతేకాదు! ఈ బాహ్య ప్రపంచాన్ని వదిలి— విరాగిలా ఆమె తలపుల్లో— జీవించటం ప్రారంభించాను. పిచ్చివాడిలా తయారయిన నన్ను చూసి, చలించిపోయేది అమ్మ. ఏ తల్లి మాత్రం భరించగలదు ఆ క్షోభ? అందుకేనేమో... నాయీ బాధను చూడలేని అమ్మ అశాంతితోనే కన్ను మూసింది.'' కర్చీఫ్‌తో కన్నులు ఒత్తుకున్నాడు శ్రీకాంత్

ఓదార్పుగా చూస్తూ, అతని మాటలు వింటోంది స్వప్న.

"కన్నుమూస్తూ అమ్మ కోరిన ఒకే కోరిక! నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవాలి! హాయిగా సాగాలి నా భావి జీవితం!! అదే ఆమె తపన. ఆ తపనతోనే కన్ను మూసింది అమ్మ. అప్పటినుంచీ నేను మరీ పిచ్చివాడిని అయ్యాను. నాకు కావలసినంత ఆస్తి వుంది. హోదాగల ఉద్యోగం వుంది. అన్ని హంగులు వున్న ఇల్లు వుంది. పనిమనుషులున్నారు. అన్నీ వున్నాయ్! అన్నీ వున్నాయ్!!... కానీ... కానీ... స్వప్నా! ఏది శాంతి? శాంతి ఏది నా మనసుకి??''

"అసలు నే నెందుకు జీవిస్తున్నానో నాకే తెలియని పరిస్థితిలో ఎంత కాలం యీ జీవన పోరాటం సాగించగలను? అసలు నే నెందుకు బ్రతకాలి? నా యీ జీవితం వ్యర్థం!... అనుకొని కృంగిపోతున్న సమయంలో... చిత్రంగా పరిచయం అయ్యావు నీవు! నీ పరిచయం నాలో ఎంతో మార్పు తెచ్చింది!! ఆశావాదాన్ని హత్తించే నీ చల్లని మాటలు, నాలోని మంటలని చల్లార్చాయి.

నీ స్నేహంలో ఏదో తీయని అనుభూతిని చవిచూశాను. మళ్ళీ నాలో ఏవో కొత్త ఆశలు చిగురించటం ప్రారంభించాయి అందుకే...'' చెప్పటం ఆపాడు శ్రీకాంత్.

స్వప్న ఏమీ మాట్లాడకుండా అలా మౌనంగానే కూర్చుంది.

ఆమె మౌనం శ్రీకాంత్‌ని తత్తరపరిచింది.

"స్వప్నా! నేనేమీ తొందరపడలేదు కదా? నీ మనసు నొప్పిస్తే— క్షమించు స్వప్నా! క్షమించు!!'' అంటూ ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకొని ప్రాధేయ పూర్వకంగా, అర్థించాడు శ్రీకాంత్.

అతని స్పర్శకే పరవశించింది స్వప్న.

"మీ అభిప్రాయం మీరు చెప్పారు. ఇందులో మీ తప్పుగాని, నేను బాధపడవల సిందిగాని— ఏముంది శ్రీకాంత్?'' అంది స్వప్న ప్రశాంతంగా.

"అయితే నీ నిర్ణయం?'' ఆశగా మళ్ళీ ప్రశ్నించాడు శ్రీకాంత్.

"నాకు కొంత వ్యవధి కావాలి!'' తల పైకెత్తకుండానే సమాధానం యిచ్చింది స్వప్న

"ష్యూర్! బాగా ఆలోచించుకొనే నీ నిర్ణయం చెప్పు! ఇది జీవిత సమస్య!'' శ్రీకాంత్ మాటలకి,

"సమస్య మాత్రం కాదులే!'' చిన్నగా నవ్వుతూ అంది స్వప్న.

"అయితే అదృష్టవంతుణ్ణే!'' హాయిగా వూపిరి పీల్చాడు శ్రీకాంత్.

"ఇహ వెడదాం! చాలా లేట్ అయ్యింది!!'' అంటూ లేచింది స్వప్న తనూ లేచి, స్వప్నని అనుసరించాడు శ్రీకాంత్

ఇసుకతెన్నులు దాటి రోడ్డు మీదికి వచ్చారు.

"నేను స్కూటరుమీద డ్రాప్ చేస్తాను'' అన్నాడు శ్రీకాంత్.

"ఒద్దు! నేను నడిచేవెడతాను. ప్లీజ్!'' అభ్యర్థించింది స్వప్న.

ఆమెని బలవంతపెట్టడం యిష్టంలేని శ్రీకాంత్, ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

స్కూటరు స్టార్ట్‌చేసి గుడ్‌నైట్ చెప్పాడు.

చిరునవ్వుతో చేయి వూపింది స్వప్న.

వేగంగా ముందుకుసాగిపోయినస్కూటరుని అలానే చూస్తూ నిలబడిపోయింది స్వప్న.

ఆమెలో ఏదో ఆలోచన! వేగంగాపోతున్న స్కూటరు... ఆ వెనుక సీటుపై తను... పొందికగా శ్రీకాంత్ నడుంచుట్టూ చేయివేసి... ఛీ! పాడు!! అప్పుడే యివేం ఊహలు? తన ఊహకి తనే సిగ్గుపడి, నడక ప్రారంభించింది స్వప్న.

* * *

స్వప్న బీచ్ రోడ్డుమీద అలా నడుస్తూనే వుంది. ఆమె హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది, శ్రీకాంత్ ఊహలు ఏదో తెలియని అనుభూతిని కల్గిస్తున్నాయి ఆమెలో.

ఎంత మంచి మనసు శ్రీకాంత్‌ది!

ఎంత చల్లని మాట చెప్పాడు శ్రీకాంత్!!

"శ్రీకాంత్! మీకెలా తెల్పను నాకృతజ్ఞత — మిమ్మల్ని భర్తగా పొందటం నా అదృష్టం! పాలనురుగులాంటి స్వచ్ఛమయింది మీ మనసు. ప్రాణానికి ప్రాణం యిచ్చే స్నేహశీలత మీలో వుంది మీలాంటి సహృదయులు నా జీవిత భాగస్వామి కావటం నా పూర్వజన్మ సుకృతం!''

"అందుకేనేమో శ్రీకాంత్! ఇన్ని సంవత్సరాలు నాకు పెళ్ళి కాకుండా పోయింది!! అందుకేనేమో శ్రీకాంత్! అన్ని సంబంధాలు వచ్చినా, అన్నీ చెడిపోయాయి.!!

శ్రీకాంత్! మీ చల్లని హృదయంలో నా స్థానం తలచుకుంటేనే ఆనందం పట్టలేకుండా వున్నాను ఐ యామ్ సో లక్కీ శ్రీకాంత్! సో లక్కీ!!'' మూగగా మనసులోనే శ్రీకాంత్‌కి కృతజ్ఞతలు తెల్పుకుంది స్వప్న.

ఇప్పుడు తన మనసెంత హాయిగా వుంది! క్షణక్షణం వేధించే ఒకే ఒక సమస్య— తన పెళ్ళి సమస్య ఇంక తీరిపోయింది. ఇప్పుడు తనకేచింతా లేదు. ఎవ్వరూ తననిక హేళన చేయలేరు.

ఎంత సంకుచిత సమాజం! జరగవలసిన సమయంలో పెళ్ళి జరగలేదనేగా అంతాతనని అంత యిదిగా సూటిపోటి మాటలతో చిత్రహింస పెడుతున్నారు?

ఆఖరికి చదువుకున్న స్నేహితురాళ్ళు మాత్రం ఏం చేశారు? ఎంత హేళన తనంటే??

ఆ కమల వుందే, ఒకప్పుడు తన డియరెస్ట్ ఫ్రెండ్! ఎంతగా మారిపోయింది!

హోదాగల అందమైన మొగుడు, ఆస్తిపరు లయిన అత్తగారు దొరికారనేగా? అంత పొగరు దానికి? తనతో మాట్లాడలేదుసరిగదా "నీ జీవితంలో పెళ్ళవుతుందా?'' అని హేళన చేస్తుందా? "ఛీ! తోటి సోదరిని అపహాస్యం చేసే నీవూ ఓ ఆడదానివేనా?'' అని అసహ్యించుకొని వచ్చేసింది తను. అంతకంటే ఏం చేయగలదా సమయంలో?

కమలకే కాదు— ప్రతి వారికి లోకువయి

పోయింది తను. దాని మొగుడు కాబట్టి అతన్ని చుట్టుకొని కూచుని పోతుంది స్కూటరుమీద అందులో మిడిసిపడిపోవల సింది ఏముంది? నాకు కాబట్టి – దొరికాడు మొగుడు! అన్యాయంగా మెరికలు తిరిగిపోతే తిరిగిపోవచ్చు. కానీ...

నీకు మొగుడు లేడు! రాడు!! అనే భావంతో వెక్కిరింపు చూపులు చూడవలసిన అవసరం ఏం వుందా విమలకి? ఈ చూపులు మరో ఆడదాని హృదయాన్ని – రంపపుకోత కోస్తా యని తెలుసుకోని దాని చదువెందుకు? చదివింది మళ్ళీ బి. ఏస్సీ!

కమల – విమలేకాదు ప్రతి స్నేహితురాలు తననిలా బాధ పెట్టినవాళ్ళే!

సరోజ కూడా మారిపోయింది. దానికి ఐదు రు పిల లు. రత్నాల్లా వుంటారు వాళ్ళు. ముద్దులు మూట కడతాయి వాళ్ళ మాటలు. వాళ్ళని చూసి పరవశించిపోయిన తను, "సరోజా' ఎంత అదృష్టవంతురాలివేనువ్వు! అన్నివిధాల ఆదరణగా చూసుకునే భర్త, ముద్దులు మూటగట్టే పాపలు! ఓహ్హో! హౌ లక్కీ యూ ఆర్! నిన్ను చూస్తుంటే నాకెంతో సంతోషంగా వుందే' ఎంతో సంతోషంగా వుంది!!" అన్న తన మాటలకి 'అసూయగా లేదా?" అని అడుగుతుందా? ఆ మాటకి నొచ్చుకొని అదేమిటే అలా అంటావ్? అంటే "ఏమిలేదే... ఎక్కువ కాలం పెళ్ళి వని ఆడపిల్లకి - పిల్లా పాపలతో కళకళలాడే పచ్చని సంసారం చూస్తే – ఏదో జెలసిలాంటిది..."

# కూయనీ కాకుల్ని

"షటప్!" గట్టిగా అరిచింది తను ఉద్రేకంతో.

సహనం అప్పటికే చచ్చిపోయింది తనలో.

"ఎంతలీవంగా మాటాడేవే సరోజా! మీ అందరికీ నేనంటే ఎందుకే అంత చులకన? కేవలం పెళ్ళి కాలేదనేనా? నాకు ఇగవై ఎనిమిది సంవత్సరాలుంటాయి. నేను ఉన్నత మయిన చదువులు చదివాను. నా చదువుకి తగ్గ భర్తని నేను కొనలేను.

నీ తండ్రిలా వేలకి వేలు దొంగ వ్యాపారా లలో సంపాదించలేదే మా నాన్న - వేలకి వేలు హెచ్చించి హోదాగల అల్లుళ్ళని కొనడానికి.

నేను ఒక్కదాన్నే అయితే ఎంతయినా వెచ్చించి నన్నో అయ్యకి కట్టపెట్టే వారేనే! కానీ నేనేకాదు, ఆయనకి నాతోపాటు మరో ఇద్దరు... నా స్వార్థం నేను చూసు కొంటే మరి వాళ్ళ గతి?


అందుకే పెళ్ళి కాకుండాపోయింది నాకు, అందుకేనే మీ అందరి మాటలు భరించవలసి వచ్చింది!!..." ఏడుస్తూ యింటికి వచ్చే సింది విసురుగా.

అలా ఎంతమంది! ఎన్నిసార్లు తనని ఏడిపించారు! ఎన్నిసార్లు తనలో తను కుళ్ళి కుళ్ళి ఏడ్చింది!

కాని...

ఇహ తనకాబాధలేదు.

కమల – విమల – సరోజ – వీళ్ళెవ్వరూ – మరెవ్వరూ, తనని ఏమీచేయలేరు!




తనూ ఓ మనిషిగా–తనూ ఓ ఇల్లాలిగా, తలెత్తుకొని యీ సమాజంలో తిరగగలదు!

తనకా ఆధారం కల్పించింది శ్రీకాంతే!

మరోసారి శ్రీకాంత్‌కి కృతజ్ఞతలు తెల్పుకుంది హృదయంలో. ఆ ఆలోచనలతో ఇన్నాళ్ళు చేరిన స్వప్న హృదయం – తేలికై పోయిగావుంది. ప్రశాంతంగా నిద్రపోయింది ఆరాత్రి. అటువంటి నిద్ర ఆమెకి కొన్ని సంవత్సరాలుగా కరువయ్యింది. కానీ ...

ఆరాత్రి మాత్రం - సుఖంగా – నిద్రాదేవి ఒడిలో కరిగిపోయింది స్వప్న.

* * *

ఆ ఉదయం కూనిరాగంతీస్తూ డ్రస్సింగ్ టేబుల్ ముందు కూచుని టాయ్‌లెట్ అవుతోంది స్వప్న.

మరికొన్ని గంటలలో, శ్రీకాంత్‌కి తన నిర్ణయం చెప్పేయాలి! అబ్బ! ఎంత సంతోషిస్తాడో శ్రీకాంత్!!

శ్రీకాంత్ తలపుల్లోకి రావటంతోనే – ఆమెలో తీయని అనుభూతి కలిగింది. ఏవో మధురమయిన ఊహల్లో పరవశించి పోతోంది స్వప్న.

కానీ ... ఆమె వూహలకి బ్రేక్ వేస్తూ – కొన్ని మాటలు వినిపించాయి. ఒక్కక్షణం హృదయం ఆగినట్లయింది.

విసురుగా కిటికీదగ్గరకు వెళ్ళింది.

పెరట్లో వరలక్ష్మమ్మ పక్కింటి వర్ధనమ్మ తనగురించే చెప్పుకుంటున్నారు.

"ఆ! అసలు పెళ్ళవుతుందనుకున్నామా ఏమిటి వదినగారూ? ఏదో రెండవ సంబంధం కాబట్టిగాని లేకపోతే ఎవడు చేసుకుంటాడు యీ పిల్లని? ఎద్దులా ఎదిగిపోయికూర్చుంది" వర్ధనమ్మ మాటలు.

"కాకపోయినా మనం ఎంత మన బ్రతు కెంత? అని చూసుకోవద్దటండీ! చది వేస్తున్నాంకదా అని చదివేయటమే? ఎమ్మెస్సీ చదివేసి కూర్చుంటే మరి యీవిడ గారి హోదాకి సరిపోయే మొగుడు వూరికే వస్తాడా?

అందుకే యిలా పెళ్ళాం చచ్చిన బాబుల్ని పడుతోంది పాపం!" జాలివంతా ఒలక బోస్తోంది వరలక్ష్మమ్మ

ఇహ ఒక్కక్షణం వారి మాటలు వింటే తనేం అయిపోతుందో! విసురుగావచ్చి మంచం మీద వాలిపోయింది. కట్టలు తెంచుకువచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. వెక్కి వెక్కి

ఏడ్పేసింది. అలా ఎంతసేపు ఏడ్చిందో ఆమెకే తెలియదు. చివరికి ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది స్వప్న—

కన్నీళ్ళతోనే లెటర్‌పాడ్ తెరిచి వ్రాయటం ప్రారంభించింది. బరువెక్కిన హృదయంలోని భావాలు, కాగితంమీద పెట్టాలంటే చేయి వణుకుతోంది. అయినా దృఢమయిన నిశ్చయంతో వ్రాయటం ప్రారంభించింది స్వప్న—

శ్రీకాంత్ !

మీ మనసులోని మాట చెప్పినప్పుడు, నేనెంత ఆనందించానో వ్రాయలేను. నా అదృష్టానికి పొంగిపోయాను. మురిసిపోయాను. చదువు-సంస్కారం-హోదా అన్నీ వున్నాయి మీలో! మిమ్మల్ని పొందటం ఒక వరంగా భావించాను. మీ ఆదరణలో నా జీవితాన్ని ఓ నందనవనంలా తీర్చి దిద్దుకోవాలని ఊహా లోకాల్లో తేలిపోయాను. కానీ... కానీ...

నేను పిరికిదాన్ని శ్రీకాంత్! పిరికివాన్ని !! దేవుడంటే భయపడను నేను. కాని సమాజానికి భయపడతాను. అసలు ఈ సంఘానికి భయపడే శ్రీకాంత్, నేను నా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాను. అదీ తెలుసు! కానీ... నాలోని ఆత్మాభిమానం నన్ను తల వంచేలా చేస్తోంది. ఈ సంఘానికి భయపడే నా చేతికందిన స్వర్గాన్ని జారవిడుచుకుంటున్నాను. ఇది నాకు కొత్తకాదు. ఎన్నిసార్లో యిలా జరిగింది! ఉత్తరం చదివి నన్ను అర్థం చేసుకుంటారని ఆశిస్తాను.

ఎమ్. ఎస్సీ చదువుతుండగానే పెళ్లి చూపుల తతంగాలు ప్రారంభం అయ్యాయి నాకు. నాపోరు పడలేక ఎమ్. ఎస్సీలో జాయిన్ చేశారు తప్ప, నాన్నకి అంత పెద్ద చదువు చదివించటం సుతరామూ ఇష్టంలేదు. ఎమ్. ఎస్సీ డిగ్రీ తీసుకుంటే పది వేలకి వచ్చే నా భర్త ఖరీదు ఇరవై వేలకి పెరిగిపోతుందేమోనని ఆయన భయం. ఆయనకే కాదు ఈ రోజుల్లో ఆడపిల్లనికన్న ఏ తండ్రికయినా, ఆ భయం వుండటం సహజమేనేమో!

అందుకే నేను ఆయన మాటకి ఎదురు చెప్పకుండా, వచ్చిన ప్రతి అబ్బాయి ముందూ తలవంచాను.

ఎమ్. ఎస్సీ పూర్తయింది. లెక్చరర్‌గా నాల్గు సంవత్సరాల అనుభవాన్ని సంపాదించాను.

కానీ ఇంతవరకూ, నా జీవితానికి గమ్యం


ఓం శ్రీ మాత్రే నమః



నవశక్తి నిలయం నుంచి
భక్తులకు వినూత్న అవకాశము

శ్రీ మురుగన్స్ మరియు జగద్గురువులు ఆశీర్వాదముతో
దైవదత్తమైన వస్తువు రూపొందించు సంస్థ

శ్రీ కంచి కామకోటి శ్రీ జయేంద్ర సరస్వతి,
శ్రీ శృంగేరి శారదాపీఠ మహా సన్నిధానము,
గోండల్ శ్రీ ఆచార్య శ్రీ శరణర్థి మహారాజ్
మరియు ఇతర ఋషి తుల్యులు.

| | | |
|---|---|---|
| 1. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) $2\frac{1}{4}'' \times 2\frac{1}{4}''$ | రూ. 450—00 |
| 2. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) $1\frac{1}{2} \times 1\frac{1}{2}''$ | రూ. 250—00 |
| 3. | దృష్టి నివర్తి యంత్రము. | రూ. 45—00 |
| 4. | దృష్టి నివర్తి డాలర్ (ఈ యంత్రము కలిగియున్న వారికి దుష్ట శక్తుల ప్రభావాన్ని తొలగించి, దృష్టి దోషమును హరించి ప్రమాదములు మొదలైనవి జరగకుండును. ఎటువంటి ఒడుదుడుకులు, కష్టములు సంభవించకుండా కాపాడును. గృహములోగాని, వ్యాపారములోగాని కూడ ఉంచుకొనవచ్చును). | రూ. 37—00 |
| 5. | వివాహప్రాప్తి డాలర్ (వివాహములు త్వరగా జరుగుటకు) | రూ. 45—00 |
| 6. | ధనప్రాప్తి డాలర్. | రూ. 45—00 |
| 7. | కామాక్షి డాలర్. | రూ. 45—00 |
| 8. | శ్రీ చక్రం యంత్రం $3'' \times 3''$ | రూ. 115—00 |
| 9. | శ్రీ చక్రండాలర్. | రూ. 45—00 |
| 10. | స్ఫటికమాల 54 పూసలు | రూ. 60—00 |
| 11. | ఒరిజినల్ తామరమాల 54 పూసలు | రూ. 100—00 |
| 12. | నవగ్రహ డాలర్లు (9 రకములు) ఒక్కొక్కటి. | రూ. 37—00 |
| 13. | రుద్రాక్షమాల 54 పూసలు | రూ. 250—00 |
| 14. | ఎలక్ట్రానిక్ బ్రాస్‌లెట్ 12 రాసులు ఒక్కొక్కటి | రూ. 20—00 |
| 15. | అష్టలక్ష్మి మరియు ఇతర దేవతా డాలర్ [ఎంబోస్‌డ్ నమూనా] | రూ. 105—00 |

ఆర్డరుతో సరుకు విలువపై 25 శాతమును ముందుగా పంపవలెను.

వస్తువులు వి.పి.పి. పోస్టు ద్వారా పంపబడును.

సంప్రదించండి.

విశ్వకర్మజ్ఞ శ్రీ విద్యా వుపాసక స్వామీజీ,

శ్రీ ఎస్. టి. మురుగభూషణం.

(ప్రెసిడెంట్ మరియు సలహాదారుడు)

నవశక్తి నిలయం,

153, లాయడ్స్‌రోడ్, గోపాలపురం, మద్రాసు-600086.

ఫోన్ : 812013. ఉత్తర ప్రత్యుత్తరములు తమిళము మరియు ఇంగ్లీషులో.

దొరకలేదు. అందుకు కారణం- నాలోని ఆత్మాభిమానం! నాలోని పిరికితనం !! అంతే శ్రీకాంత్! అంతే !!

నాకు వచ్చిన మొదటి సంబంధం చాలా మంచిది, వారు గొప్ప ధనవంతులు. అయినా ఏమాత్రం గర్వంలేని మంచి మనసు కలవారు. వచ్చిన అందరిలోనూ ఎంతో సంస్కారం కొట్టవచ్చినట్టు కన్పించింది.

పిచ్చి పిచ్చి ప్రశ్నలతో, అవహేళనతో, ఆడపిల్లల మనసుని క్షోభపెట్టే విధంగాకాక, ఎంతో హుందాగా ముగించారు పెళ్ళిచూపుల తతంగం.

ఆహ ఆయన ఏదో కంపెనీలో ఇంజనీర్‌గా వర్క్ చేస్తున్నట్టు చెప్పారు. అందగాడేమీ కాదు. కానీ అంతకు మించిన మంచి హృదయం గలవాడు. ఆయనతో మాట్లాడిన అయిదునిముషాలో నే అర్థం చేసుకున్నాను, ఆయన నిర్మల మనస్తత్వాన్ని.

అందం శాశ్వతంకాదు. నా భర్త నల్లగా వుంటే వుండనీయ్! కానీ తెల్లని మల్లెపూవు లాంటి మంచిమనస్సున్న వ్యక్తి అని సరిపెట్టుకున్నాను. అందుకేఅంగీకరించాను ఆనందంగా.

కానీ రెండురోజుల్లోనే సంఘం విసిరిన విసుర్లకు విలవిలలాడిపోయాను. "కాకిముక్కుకి దొండపండులా మంచి జోడీయేలే!" అని ఒకరంటే "కాకిఅయినా, కోకిలయినా— తప్పదు కదా పిన్నిగారూ! నేను అందాల బొమ్మని! చదివేశాను ఎమ్మెస్సీ అంటే సరిపోతుందేంటి? ఇమ్ముకోవద్దూటండీ? అదేలేని యీపిడగార్కి యింతకంటే అందాల మొగుడు దొరుకుతాడా ఏం?" అంటూ సాగదీస్తుంది మరొకావిడ.

"అందగత్తెనని మురిసిపోయేది కదా! యీవిడ విరగబాటుకి తగినశాస్తే జరిగింది!" ఇంకా ఏదో అక్కసు కక్కుతోంది మరొక ముత్తైదువ

ఇక వినలేకపోయాను.

నాలోని రక్తం కుత కుత లాడింది.

కసిగా పిడికిలి బిగించాను. నన్ను అవమానించిన యీ సంఘం సిగ్గుపడి తలవంచుకొనేలా చేస్తాను. నా అందాన్ని మెచ్చి నన్ను కోరివచ్చిన యువకుడు కట్నం లేకుండా నన్ను చేసుకొన్న రోజే పెళ్ళి చేసుకుంటాను!! అంటూ మనసులో శపథం చేశాను. మీకు ముందే చెప్పానుగా! నాకు ఆత్మాభిమానం ఎక్కువని!! ఆ అభిమానం వల్లే అన్ని విధాల

## కూయని కోకిల్ని

మంచివయిన ఆ సంబంధాన్ని కాలదన్నుకున్నాను

"ఆయిన నాకు నచ్చలే" అన్న మాటలకు అప్పట్లో అంతా నిర్ఘాంతపోయారు. కానీ. శ్రీకాంత్!

సంఘానికి భయపడి అంత సహృదయుణ్ణి భర్తగా స్వీకరించలేకపోయిన నా తెలివితక్కువతనానికి ఇప్పటికీ నిర్ఘాంతపోతూనే వుంటాను నేను, ఆయన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా!

కాల ప్రవాహంలో రెండు వసంతాలు కొట్టుకుపోతేనేగాని అర్థం కాలేదు నాకు అసలు విషయం—

'కట్నం' అనే పదార్థం కన్నె గులాబీకి ఎంత పరిమళాన్నిస్తుందో అప్పటికి అర్థం

### రష్యాకికూడా జపానేగతి !

మర మనుషుల తయారీలో జపాను ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇటీవల రష్యా, మర మనుషులను వుపయోగించడం గురించి సాంకేతిక మెళకువను అందించవలసినదిగా జపానులోని జపాను ఇండస్ట్రియల్ రాబట్ కంపెనీ వారిని కోరింది. మర మనుషులను ఉపయోగించడంలో సెన్సర్లను, మైక్రో సెసర్లను ఉపయోగించాలని రష్యా భావిస్తోంది. కొంత కాలం క్రితం ఈ జపాను కంపెనీ రష్యా, స్వీడన్ దేశాలకు తన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. జపాన్ పరిశ్రమలు గత సంవత్సరంలో 22 వేల మర మనుషులను తయారు చేశాయి

అయ్యింది. అది లేని బ్రతుకు సువాసనలేని కాగితం పువ్వు అని; తుమ్మెదని కాదు కదా, కనీసం తూనీగని సయితం ఆకర్షించలేదని తెలుసుకొనేసరికి మరో సంవత్సరం పట్టింది. అందుకే కట్నం యివ్వటం విషయంలో నా శపథాన్ని సడలించుకున్నాను.

నానిర్ణయానికి మురిసిపోతూ హుషారుగా 'వేట' ప్రారంభించారు నాన్న. కానీ ఫలితం శూన్యం. ఎంత ఆశతో వెళ్ళేవారో— అంత నిరాశతో తిరిగి వచ్చేవారు.

అటువంటి నిస్సహాయ స్థితిలో నన్ను వివాహమాడటానికి ముందుకు వచ్చిన ఓ మంచి వ్యక్తి "పీటర్". పీటర్ నా ఎమ్మెస్సీ క్లాస్‌మేట్. నన్నెంతగానో అభిమానించేవాడు చదువుకొనే రోజుల్లో.

ఎమ్మెస్సీ పూర్తిచేసి లెక్చరర్ గా జీవితంలో స్థిరపడ్డాక, తన అభిప్రాయం తెల్పాడు పీటర్

పైసా కట్నం లేకుండా నన్ను అత్యంత అభిమానంతో వివాహమాడటానికి ముందుకు వచ్చిన వ్యక్తి పీటర్. నేనెంతో సంతోషించాను. కానీ ఆ సంతోషం క్షణికమే అయ్యింది.

"చూస్తూ చూస్తూ కులం తక్కువవాడికిచ్చి ఎలా కట్టబెట్టమే తల్లీ?" అంటూ వాపోయింది అమ్మ.

"కులంలో ఏముందమ్మా? పీటర్‌ది ఎంతో మంచి మనస్సు నన్ను పువ్వుల్లో పెట్టుకొని పూజిస్తాడు..." ఇంకా ఏదో చెప్పబోయాను. కానీ చెప్పనీయలేదు నాన్న.

"పీటర్ మంచి వ్యక్తే! కాదనను. కానీ సంఘానికి కావలసింది మాత్రం అది కాదు. సంఘ కట్టుబాట్లని అతిక్రమించలేం మనం! అతిక్రమించితే ఫలితాలు విపరీతంగా వుంటాయి! నీ పెళ్ళి జరగటమే ముఖ్యంకాదు. నీ వెనుక మరో ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు. వాళ్ళ పెళ్ళిళ్ళు సక్రమంగా జరగాలిగా ..."

అర్థం అయ్యింది నాన్న భావం నిజమే! నా స్వార్థం నేను చూసుకుంటే ఎలా?పొంగుకొస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకొని మూగగా రోదించాను నా దురదృష్టానికి!

శ్రీకాంత్! ఇక్కడ మీకు రెండు సంఘటనలు మాత్రమే రాశాను.కానీ నా జీవితంలో యింతవరకూ అలాంటి సంఘటనలే ఎదురయ్యాయి. సంఘానికి భయపడి, ఆత్మాభిమానానికి పోయి, ఎన్నిసార్లో నాకందిన అదృష్టాన్ని జారవిడుచుకున్నాను.

ఇప్పుడూ అంతే శ్రీకాంత్! మీరందించిన చేయి అందుకోలేకపోవడానికి కూడా కారణం నాలోని పిరికితనమే శ్రీకాంత్! పిరికితనమే!! కాదు—ఆత్మాభిమానం కూడా...

"గతిలేక రెండవపెళ్ళి వాడికి కట్టబెట్టుకుంటుందని సమాజం నన్ను అపహాస్యం చేస్తుంటే నేను భరించలేను శ్రీకాంత్! నేను భరించలేను !!"

నా ఆవేదన అర్థం చేసుకుంటారని ఆశిస్తాను. దయుంచి, నన్ను మరిచిపొండి.

మిమ్ము పొందలేని

స్వప్న

తాజా వార్తలకు, వ్యాఖ్యలకు, కొంగ్రొత్త ప్రత్యేక శీర్షికలకు ఆంధ్రపత్రిక దిన పత్రిక పెట్టింది పేరు...మీరు మీ కాపీ మీ ఊరి ఏజెంటుద్వారాగాని లేదా మానేజరు, గాంధీనగరం, విజయవాడ-3 లేదా మానేజరు, బషీర్‌బాగ్, హైద్రాబాద్-29 కి గాని వ్రాసి పోస్టులో తెప్పించుకొనండి.

# గ్రామాలకేమో ఎక్కువ లాభం
# మీకూ, నాకూ మరింత లాభం

మన రాష్ట్రంలో జీవ నదులున్నాయి. సిరులు పండే భూములున్నాయి. కష్టించి పనిచేసే రైతు బిడ్డలున్నారు. వీటన్నిటినీ సమన్వయ పరచి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది.

ఆయకట్టు ప్రాంతాల అభివృద్ధిని చేపట్టడం ద్వారా వ్యవసాయం ఆధునికం చేయబడుతోంది. నాగార్జునసాగర్ కుడి కాల్వ, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, శ్రీరాంసాగర్, తుంగభద్ర సముదాయం — ఈ నాలుగు ఆయకట్టు ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నారు.

వంతులవారీగా నీటిని సరఫరా చేసే వరబంధి విధానం రైతుల ఆదరణ పొందుతోంది.

★ పొలాలకు కాల్వల ఏర్పాటు.

★ క్రమబద్ధంగా భూమిని అభివృద్ధిపర్చడం.

★ రైతులకు పరపతి సౌకర్యాల కల్పన.

★ సమగ్ర వ్యవసాయ విస్తరణ కార్యక్రమం.

పథకాలు అమలు జరిపేందుకు 1981-82 సం.లో రూ. 897 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈనాడు అధికంగా ఆహారధాన్యాలు, వాణిజ్య పంటలు పండిస్తున్నారు.

**రైతుల ఆనందమే మనకు ఆనందం**

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

**D.I.P.R No. 25514/Advt/Cl-3/81**



సంతానము
గర్భాశయ వ్యాధులు
సుఖప్రసవము
సెక్స్ ఆంతరంగిక సమస్యలు
మొలలు,చర్మవ్యాధులకు
అనుభవ చికిత్స.
పోస్ట్‌ద్వారా చికిత్సకలదు

**సరోజ నర్సింగ్ హోమ్**

డా. ఎస్. సరోజినీదేవి - డా. వి. మధు
(సెక్స్ స్పెషలిస్ట్)
H.O. శ్రీనివాసమహల్, గణపతిరావురోడ్, విజయవాడ-1
● బ్రాంచి: జిన్నాటవర్, శీలంవారి వీధి, గుంటూరు-1

**జౌలిక్స్ లోషన్**

గజ్జి తామరకు పేటెంటు మందు
అన్ని షాపులలోను దొరకును

ORIENTAL CHEMICAL WORKS
RAO (INDORE)




ఆయుర్వేదీయ

**బైద్యనాథ్**
**దంతమంజన్**
**ఎఱ్ఱ పళ్ళపొడి**

కేవలము పళ్ళపొడే కాదు !
ఆయుర్వేద ఔషధము
కూడాను !!

**దంతములను చిగుళ్ళను గట్టి పరచును**



ఇతర టూత్ పేస్టులు,పళ్ళపొడులు దంతములను శుభ్రపరచును. వీనిలో ఔషధి పదార్థములు లేనందున రోగముల నరికట్టలేవు. కనుకనే భారతదేశములో 90 శాతము ప్రజలకు చిగుళ్ళ బాధ లున్నాయి.

దంతనిపుణులున్నటువంటి కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియావారిచే ఆమోదించబడింది. ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధములను తయారుచేయు శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ వారిచే లవంగనూనె, వేప, తుమ్మ, శొంఠి, కర్పూరము మొదలగు అనేక అమూల్య వనమూలికలతో తయారు చేయబడినది. బైద్యనాథ్‌వారి ఎఱ్ఱ పళ్ళపొడి వాడుట వలన దంతములు, చిగుళ్ళు ధృఢముగా, ఆరోగ్యముగా నుండును.

శ్రీ
**బైద్యనాథ్**
ఆయుర్వేద భవన్
లిమిటెడ్

ఆయుర్వేద
ఔషధముల
తయారీదారులలో
ప్రసిద్ధులు

INTERMARK/DML 19T


## కూయని కాకుల్ని

ఉత్తరం వ్రాయటం పూర్తిచేసిన స్వప్న మళ్లీ ఒకసారి అంతా చదువుకొంది. ఇప్పటికే ఆమె కన్నులు నీళ్ళతో నిండిపోయాయి. ఉత్తరం మడిచి కవరులో పెట్టి టేబుల్ పై వుంచి, కన్నీళ్ళతోనే మంచం మీద వాలిపోయింది.

* * *

"నువ్వు చాలా తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నావే స్వప్నా!" జయ అన్న మాటలే జ్ఞాపకం వస్తున్నాయి స్వప్నకు.

"సంఘం సంఘం, అంటూ కూచుంటే నీకీ జన్మలో పెళ్ళికాదే పిచ్చి మొద్దూ! నా మాట విను శ్రీకాంత్‌కి మాత్రం వ్యతిరేకంగా జవాబు చెప్పకు అటువంటి వ్యక్తి కోటి జన్మలెత్తినా దొరకడు" జయ గట్టిగా నొక్కి చెప్పింది పదే పదే.

తన శ్రేయస్సు కోరే ఫ్రండ్స్ ఎవరయినా వున్నారంటే జయను ఒక్కదాన్నే చెప్పుకోవాలి. అందుకే తన పెళ్ళి సమస్యని సయితం జయ ముందుంచింది తను. ఎన్ని విధాల ఆలోచించినా, శ్రీకాంత్ అందించిన చేయి అందుకోవటమే మంచిది అంటుంది జయ. తనకి మాత్రం అందుకోవాలని లేదా హృదయంలో? కానీ సమాజపు సూటీపోటీ మాటలను ఎలా భరించగలదు తను? గత్యంతరం లేక, కన్నె చెర నుంచి విముక్తి కోరి రెండో పెళ్ళి వాడిని చేసుకొన్నావని సంఘం ప్రతి ఒక్కరూ, అనుక్షణం తనని చిత్రహింస పెడుతుంటే, ఇహ, ఈ పెళ్ళి చేసుకొని తను పొందగలిగే ఆనందం మాత్రం ఏముంటుంది? అనాలే జయతో అంది తను.

"మరి సమాజం విసిరే విసుర్లు భరించటం ఎలా?" తన మాటకి ఖస్సున లేచింది జయ.

"హూ! సమాజం!సమాజం!!సమాజం!!! ఎందుకే? సమాజం — సమాజం అంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటావు? నీ కోసం నీవు బ్రతకటం అలవాటు చేసుకో! సమాజం కోసం కాదు!! సమాజాన్ని పట్టించుకొంటే జీవితంలో ఒక్క అడుగు ముందుకువేయలేం. మంచిని సయితం మరుగు పరిచి చెడ్డగా చిత్రించి హేళనచేసే సమాజం మనది.

చదువు, సంస్కారం వున్న వనితలు తక్కువ మనసమాజంలో. పనికిరాని కబుర్లకి ప్రాధాన్యత యిచ్చే సోమరిపోతులే ఎక్కువ సమాజంలో.

ఆడదాన్ని ఆడదే అవహేళన చేసే ఈ సమాజంలో నువ్వేపని చేసినా అపహాస్యం ఎదురవుతూనే వుంటుంది. అంత మాత్రాన అవన్నీ పట్టించుకొని జీవితాన్ని నాశనం చేసుకుంటే ఎలా? ఎన్ని సంబంధాలు వచ్చాయి నీకు! అన్నింటినీ చెదరగొట్టావు! ఎందుకు ఈ సమాజాన్ని పట్టించుకొనేగా ??

నల్లగావుంటాడనో లేక, సన్నగా వుంటాడనో, కులం తక్కువవాడనో లేక, చదువు తక్కువవాడనో, యీ సమాజంలోని, సోమరి అమ్మలక్కలు అనడం, ఆ మాటలు విని వినడంతోనే, రోషంతో నువ్వో ప్రతిజ్ఞ చేసేసి ఆ సంబంధాన్ని కాదనటం—అంతేతప్ప, జీవితాన్ని గురించి సీరియస్‌గా ఆలోచించావా?

సరే, యింతవరకూ ఆలోచించి వుండవు ఇప్పుడయినా ఆలోచించు శ్రీకాంత్‌కి ఏం తక్కువ? ఆస్తి వుంది అందం వుంది. అధికారంగల హోదా వుంది అన్నిటినీమించిన అందమైన హృదయం వుంది. నీకూ, అతని మీద అత్యంత ప్రేమాభిమానాలు వున్నాయ్! మరెందుకు కాదనాలి? సమాజం ఏదో అంటుందనేనా ??

స్వప్నా! ఒకటిమాత్రం జ్ఞాపకం వుంచుకో!! మనం తీసుకొనే నిర్ణయాల మీదే ఆధారపడి వుంటుంది మన జీవిత పురోగమనం. ఒకోక్షణంలో తీసుకొనే నిర్ణయాలు జీవితంలో చందమామ చల్లదనాన్ని చిందించనూగలవు — లేదా భగ్గున మండే బడబాగ్నులని రగిలించనూ గలవు.

దేనికయినా బాధ్యులం మనం — మన నిర్ణయాలే!

ఇప్పటికయినా — ఓ మంచి నిర్ణయాన్ని తీసుకొని జీవితాన్ని నందన వనంలా తీర్చి దిద్దుకో స్వప్నా! ప్లీజ్ !!"

ఉద్వేగంతో ప్రబోధనాత్మకంగా చెప్పుకు పోయిన జయ మాటలు విని చలించిపోయింది తను. ఇప్పటికి కూడా జయ ఎదురుగా వుండి చెబుతున్నట్టుగా వుంది తనకు.

నిజమేనేమో!

సమాజం-సమాజం అంటూ, ఇలావచ్చిన అవకాశాలన్నీ జారవిడుచుకుంటే చివరికి తన బ్రతుకేమయిపోతుంది? ఇంకా అపహాస్యం పాలయిపోదూ?

అప్పుడు మాత్రం యీ సమాజం వూరుకుంటుందా?

"నీకీజన్మలో పెళ్లి కాదు" అంటూ కాకుల్లా పొడిచేయరూ తనని! తనకి పెళ్లి కాని రోజు, తన చెల్లెళ్ళకి మాత్రం ఎలా జరుగుతుంది పెళ్లి?

తన బ్రతుకుతోబాటు, వాళ్ల బ్రతుకులు కూడా...

"నో! అలా జరగటానికి వీల్లేదు !!"

గట్టిగా అరిచింది— ఊహాలోకాలోంచి యీ లోకంలోకి వచ్చిన స్వప్న ఆవేశంగా. వాచీ చూసుకుంది. అయిదు అవుతోంది. శ్రీకాంత్ వచ్చే టైమయ్యింది. తననిర్ణయం తెలుసుకోవాలనే ఆత్రతతో మరి కొంచెం ముందే రావచ్చు శ్రీకాంత్. ఖంగారుగా డ్రస్సింగ్ టేబుల్ ముందుకు వెళ్ళింది. ఐదు నిముషాల్లో అప్సరసలా తయారయ్యింది. అంతలోనే స్కూటరు హారన్ విన్పించడంతో బయటకు పరుగు తీసింది.

శ్రీకాంత్ !

ఆమె హృదయం ఆనందంతో రెపరెప లాడింది. హుషారుగా—ఎదురు వెళ్లి ఆహ్వానించింది స్కూటర్ పార్క్ చేసి, చిరునవ్వుతో ఆమెను అనుసరించాడు, శ్రీకాంత్.

డ్రాయింగ్ రూమ్ నీట్‌గా వుంది. రూమ్‌లోని అలంకారాలని పరిశీలనగా చూస్తూ, స్వప్న చూపిన కుర్చీలో కూర్చున్నాడు శ్రీకాంత్.

"చాలా నీట్‌గా వుంచారే గదిని!"

శ్రీకాంత్ మాటకి, సిగ్గుతో నవ్వుతూ, "మన ఇంటిని యింతకంటె నీట్‌గా ఉంచుతానులెండి!" అంటూ లోనికి వెళ్ళింది స్వప్న కాఫీ తెచ్చేందుకు.

ఆమె సమాధానంవిని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు శ్రీకాంత్. ఒక్కమాటలో తన నిర్ణయాన్ని తెల్పిన స్వప్నకు కృతజ్ఞతలు తెల్పాడు.

"థాంక్స్ చెప్పవలసింది మీరు కాదు! నేను!! కాఫీ తీసుకోండి." అంటూ కప్పు అందించింది స్వప్న.

సంతోషంతో కాఫీ కప్పు అందుకొని, సిప్ చేస్తూ టేబుల్‌మీది కవరు చూసి,

"అరె! ఇది నాకు రాసినకవరే!" అంటూ అందుకోబోయాడు ఆత్రతగా.

"అది మీకు రాసిన కవరే అయినా, మీరు మాత్రం చదవకూడని కవరు!" అంటూ, అతని చేతిలోని కవరు అందుకొని, ముక్క ముక్కలుగా చించి చెత్తబుట్టలోకి విసిరింది స్వప్న చిరునవ్వుతో.

అయోమయంగా ముఖం పెట్టిన శ్రీకాంత్‌తో,

"అది అంతే! అంతా తర్వాతచెబుతాను!! ఇహపోదాంపదండి. పిక్చరుకు టైం అయ్యింది" అంటూ లేచింది.

శ్రీకాంత్ కూడా లేచి బయటకు నడిచాడు.

రూమ్‌కి తాళంవేసి, శ్రీకాంత్ వెనుక నడిచింది స్వప్న.

స్కూటరు మీద శ్రీకాంత్ విలాసంగా కూర్చున్నాడు.

అతని వెనుక స్వప్న!

పొందికగా కూర్చుంది.

హాయిగా వుందామె మనసిప్పుడు.

స్కూటరు కదిలింది స్పీడుగా.

సున్నితమయిన తన చేతితో — శ్రీకాంత్ నడుముచుట్టింది, స్వప్న సిగ్గుపడుతూనే.

స్కూటరు మరింత స్పీడందుకుంది!

